విశాలాంధ్ర ప్రాంతీయం
గుంటూరు, బాపట్ల, పల్నాడు

ఈ-కామర్స్ ఆవిష్కరణలతో మరింత వృద్ధి

విశాలాంధ్ర-గుంటూరు : భారత్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న హైపర్ వాల్యూ ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్, షాప్సీ బై ఫ్లిప్‌కార్ట్ ఎక్కువమంది వినియోగదారులకు సేవలనందించడానికి తమిళ, తెలుగు భాషలలో పరిచయం చేసిందని హెట్రోజీనియస్ ఫ్లిప్‌కార్ట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అండ్ హెడ్ న్యూ బిజినెస్ ఆదర్శ్ మీనన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది వినియోగదారులు తమ ప్రాధాన్యత భాషను ఎంచుకునే అవకాశం కల్పించడంతో పాటుగా విస్తృత శ్రేణిలో అందుబాటు ధరల ఉత్పత్తులను తమ ఫ్లాట్‌ఫామ్‌పై అతి సులభంగా పొందే అవకాశాన్ని అందిస్తుందన్నారు. సౌకర్యవంతమైన షాపింగ్ అనుభవాలను పొందడంలో భాగంగా తమ షాపింగ్ అవసరాల కోసం విలువ ఆధారిత ఉత్పత్తుల కోసం వెతికే వినియోగదారుల కోసం షాప్సీతో ఈ-కామర్స్ ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారుతుందన్నారు. ఇటీవల షాప్సీ యాప్‌కు గూగుల్ ప్లే బెస్ట్ ఆఫ్ యూజర్స్ ఛాయిస్ అవార్డు లభించడం ఆనందంగా ఉందని చెప్పారు.

నలుగురు బైక్ దొంగల అరెస్ట్

విశాలాంధ్ర-రేపల్లె : మోటార్ సైకిళ్ళు దొంగతనం చేస్తున్న నలుగురు యువకులను అరెస్టు చేసినట్లు రేపల్లె సబ్ డివిజనల్ పోలీస్ అధికారి టి.మురళీ తెలిపారు. ఈన కార్యాలయంలో బుదవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో రేపల్లె, నిజాంపట్నం, కొల్లూరు, వేమూరు పరిసర ప్రాంతాలలో జరిగిన బైక్ దొంగతనాలకు సంబంధించి జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు పట్టణ సీఐ విజయ చంద్ర నాలుగు ప్రత్యేక టీములను ఏర్పాటు చేశారని వివరించారు. ఈ నెల 6న పెనుముడి చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు పరిశీలిస్తున్న ఎస్ఐ భరత్ అనుమానాస్పదంగా ఉన్న నలుగురు యువకులను అదుపులోనికి తీసుకుని విచారించినట్లు తెలిపారు. వీరిలో తెనాలికి చెందిన మొహమ్మద్ అబ్దుల్ సమీర్(20), రేపల్లె పట్టణానికి చెందిన పీత వెంకటేష్(22), పీత రవితేజ(20), గరికపాటి భవానీ ప్రసాద్(20) ఉన్నారన్నారు. వీరు అంతా స్నేహితులనీ, చెడు అలవాట్లకు బానిసలై వారీ అవసరాలు తీర్చుకోవటానికి బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు నేరం అంగీకరించారని తెలిపారు. మోటార్ సైకిళ్ళు విలువ రూ.2.50 లక్షల ఉంటుందని అంచనా వేశారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు చెప్పారు.

చీటింగ్ కేసుల విచారణ వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలో చీటింగ్ కేసుల విచారణ వేగవంతం చేయాలని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. చీటింగ్ కేసులపై బుధవారం ఎస్పీ సమీక్షా సమావేశం నిర్వహించారు. బాపట్ల, చీరాల సబ్ డివిజన్ పరిధిలో దర్యాప్తులో ఉన్న చీటింగ్ కేసులు, 2021 నుండి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి సమీక్షించారు. ప్రతి కేస్ ఫైల్‌ను పరిశీలించి కేసులలో పోలీస్ అధికారులు దర్యాప్తు చేసిన విధానాన్ని పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా దర్యాప్తు చేయడానికి తీసుకోవలసిన చర్యలను, మెళకువలను సూచించారు. కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలు నిరోధించడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. అడిషనల్ ఎస్పీ పి.మహేష్, డి.సి.ఆర్.బి డి.ఎస్.పి జి.లక్ష్మయ్య , చీరాల, బాపట్ల డీఎస్పీలు శ్రీకాంత్, ఏ. శ్రీనివాసరావు, సీసీఎస్ సీఐ ఎం.మురళి కృష్ణ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా తప్పలను ప్రక్షాళన చేయండి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఓటర్ల జాబితాలోని తప్పులను ప్రక్షాళన చేయాలని అవగాహన సంస్థ సీనియర్ సభ్యులు ఎస్.చంద్రశేఖర్ ప్రభుత్వానికికి విజ్ఞప్తి చేశారు. ఓటర్లు తమ ఓట్లను స్వచ్ఛందంగా పరిశీలించుకునే అవకాశం కల్పించాలని కోరారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 'ఓటర్ల జాబితాలో ప్రక్షాళన' అనే అంశంపై బుధవారం చర్చించారు. .చంద్రశేఖర్ మాట్లాడుతూ 20ఏళ్ళ నుంచి ఓటు వేసిన వారికి ఎన్నికల్లో ఓటు లేకుండా పోయిందని ఆరోపించారు. వాణిజ్యవేత్త ఎల్ వెంకటరత్నం మాట్లాడుతూ ప్రజాస్వామ్య ప్రభుత్వాలకు ప్రాణం పోసే ఎన్నికలకు మూలాధారమైన ఓటర్ల జాబితాలపై మొట్టమొదటి నుంచి నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉందన్నారు. న్యాయవాది అవధానుల హరి, కొండా శివరామిరెడ్డి, ఎస్.మూర్తి, మురళీకృష్ణ, జనార్ధనరావు పాల్గొన్నారు.

ఐలవరంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

విశాలాంధ్ర - భట్టిప్రోలు : మండలంలోని ఐలవరంలో బుధవారం తెలుగుదేశం పార్టీ నాయకులు వైసీపీ ప్రజా వ్యతిరేక విదానాలను నిరసిస్తూ 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. జొన్నాదుల వెంకటేశ్వరరావు, కూరపాటి రఘురామయ్య, దీపాల శివప్రసాద్, జొన్నాదుల లీలాకృష్ణ, తదితరులు పాల్గొని కరపత్రాలు పంపిణీ చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను నమోదు చేసుకు న్నారు. రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా , కుక్కల వెంకటేశ్వరరావు, కటకం కుమారస్వామి, కంభం సుధీర్, గాత్రం నారాయణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు

మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం: కోవెలమూడి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర(నాని) అన్నారు. బుధవారం స్థానిక 30వ డివిజన్‌లో "ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి" కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. నాని మాట్లాడుతూ డివిజన్‌లో ప్రజలు స్థానికంగా వారు ఎదుర్కొంటున్న మంచినీరు, డ్రైనేజీ, రోడ్ల సమస్యలు అధికంగా ఉన్నట్లు తన దృష్టికి తీసుకొచ్చారని, అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌ని ఇంటికి పంపిన రోజే రాష్ట్రానికి పట్టిన ఖర్మ తొలగిపోయిది అని అన్నారు. ఈ కార్యక్రమంలో కురంగి శ్రీనివాస్, చింతకాయల రామారావు, పేరం అనిత, షాహిద్ బాబు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

విశాలాంధ్ర, పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రైల్వేగేట్ వద్ద బుధవారం ఓర్సు నాగులు (26) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. సీఐ మధుసూదనరావు, ఎస్ఐ అమీర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

విశాలాంధ్ర-రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో బుధవారం ఓ గుర్తు తెలియని మృతదేహం గుర్తించినట్లు ఎస్ఐ సయ్యద్ షమీర్ భాష తెలిపారు. స్థానిక బాల వికాస్ హైస్కూల్ సమీపంలో నున్న శంకర్ కోళ్లఫారం ప్రక్కన ఉన్న రేల్లుగడ్డిలో సుమారు 60 సంవత్సరాల వ్యక్తి మృతదేహం చూసిన కొందరు పోలీసులకు సమాచారం అందించారన్నారు. ఏఎస్ఐ హనుమంతురావు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. తెల్ల పంచ, తెల్ల చొక్కా, జేబులో చుట్టలు, చేతి కర్ర, తెల్ల జుట్టు, కొద్దిగ బట్టతల ఉందన్నారు. వ్యక్తికి సంబంధించిన వారు స్టేషన్లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

ఉపాధ్యాయులపై కక్ష సాధింపు మానుకోవాలి

ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు : ఉద్యోగ, ఉపాధ్యాయులపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలను మానుకోవాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అన్నారు. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమేనని, వారి పట్ల ప్రభుత్వం వివక్షత చూపటం సరికాదన్నారు. ఎస్టీయూ రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అనుసరిస్తున్న సాచివేత ధోరణిని నిరసిస్తూ గుంటూరు జిల్లా కలెక్టరేట్ ఎదుట ఎస్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు అధ్యక్షతన బుధవారం ధర్నా నిర్వహించారు.

ముఖ్యఅతిథిగా హాజరైన నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సకాలంలో అమలు చేస్తున్న ఉద్యోగులకు హక్కుగా రావలసిన పీఆర్సీ, డీఏ అరియర్స్, సరెండర్ లీవు బకాయిలను నెలలు తరబడి జాప్యం చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగానే ఉందని స్వయంగా ముఖ్యమంత్రే అసెంబ్లీలో ప్రకటించినప్పటికీ, నవంబర్ జీతాలు ఇప్పటి వరకు ఉద్యోగుల బ్యాంకు ఖాతాలో జమకాకపోవడం శోచనీయమన్నారు. 11వ పీఆర్సీ సందర్భంగా జరిగిన ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల సమావేశంలో ప్రభుత్వ పెద్దలు 34 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులని ప్రగల్భాలు పలికి చివరికి కేవలం 4 వేల మందికి మాత్రమే పదోన్నతులను ఇవ్వటం ఎంతవరకు సమంజసమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పదోన్నతులు ఇచ్చిన ఉపాధ్యాయులకు ఇంతవరకు పోస్టింగ్ కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడు రోజుల్లోగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ అమలు చేస్తానన్న హామీని వెంటనే నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయులకు ఎన్నికలు, జనన గణన విధులే కాకుండా, ప్రతిరోజు బోధనా విధులకు ఆటంకంగా ఉన్న బోధనేతర కార్యక్రమాలన్నిటిని వెంటనే రద్దు చేయాలని కోరారు. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లుల మంజూరులో జాప్యాన్ని నివారించి వెంటనే మెడికల్ బిల్లులకు నిధులు విడుదల చేయాలని కోరారు.

ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు సిహెచ్ జోసెఫ్ సుధీర్ బాబు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ ప్రతి నెల ఒకటో తేదీనే జీతభత్యాలు ఇచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల కొరత నివారించడానికి డీఎస్సీ 98 వారికి నియామకం చేయాలని కోరారు. జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలు, ఉపసంహరణ నిధులను వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫేషియల్ యాప్‌లో ఉన్న అనేక సమస్యలను ఎదుర్కొంటూ ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులుపడుతున్న దృష్ట్యా హాజరు కాలపరిమితిని మినహాయించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్వో చంద్రశేఖర రావుకి అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఎస్టీయూ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గేరా మోహనరావు, చందా నరసింహారావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎస్.రామచంద్రయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబరీష్యుడు, రాష్ట్ర కార్యదర్శి కాకుమాను జోజప్ప, రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యులు వాసిమళ్ల ప్రసాదరావు, రాష్ట్ర మహిళా కన్వీనర్ సిహెచ్ ఉమా, ఉపాధ్యాయ వాణి జిల్లా కన్వీనర్ షేక్ బాజీ, జిల్లా ఆర్థిక కార్యదర్శి సిహెచ్ వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిలర్ కె.బెనర్ బాబు, కేవీ సుబ్బారావు, ఎంపీ సుబ్బారావు, కొరివి అనిల్ కుమార్, ఈ.ఏడుకొండలు, మద్దిరాల వెంకటేశ్వర్లు, జి.జోజప్ప తదితరులు పాల్గొన్నారు.

మృతురాలికి కౌలురైతు కార్డు!

ఒప్పిచర్లలో విచారణ
విస్తుపోయిన అధికారులు
వాలంటీర్ల లీలలు
మూడేళ్లుగా కొనసాగుతున్న వైనం

విశాలాంధ్ర-కారంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో జరిగిన కౌలురైతు కార్డుల అక్రమాలపై ఆగ్రామ సచివాలయం-2 నందు పులిచింతల ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ వసంతకుమార్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి మురళి బుధవారం విచారణ చేపట్టారు. ఈ ఏడాది జూన్ నుండి ఇప్పటి వరకు ఆగ్రామ పరిధిలో విఆర్వోలు, ఆర్‌బికె విఏఏ కలిసి 92 కౌలురైతు కార్డులు జారీ చేశారు. అందులో 58 కౌలురైతులకు రూ.6,67,000 వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. రైతులకు తెలియకుండా వారి పట్టాదారు పాసుపుస్తకాలు వాలంటీర్ల ద్వారా సేకరించారు. ఈ విషయం తెలుసుకున్న రైతులు స్పందనలో జాయింట్ కలెక్టర్‌ను కలిసి వివరించారు. జెసి ఆదేశాలపై గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ విచారణలో ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగు చూశాయి.

వల్లెపు దుర్గ అనే మహిళ పేరున కౌలురైతు కార్డు సృష్టించారు. దుర్గ బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం రూ. 11,500 నగదును జమ చేసింది. దుర్గ నుండి వాలంటీర్ కరువు పని డబ్బులు బ్యాంకు ఖాతాలో పడ్డాయని, రూ. 8 వేలు తిరిగి యివ్వాలని ఆమె నుండి నగదు వసూలు చేశారు. తన పేరున కౌలుకార్డు ఉందని విచారణలో తేలగా దుర్గ విస్మయానికి గురి అయినది. పిడుగురాళ్ల మండలం జూలకల్లు గ్రామానికి చెందిన కర్లకుంట సరస్వతి అనే మహిళ మరణించింది. ఆమె పేరున కారంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామంలో కౌలురైతు కార్డు మూడు సంవత్సరాలుగా ఉంది. సదరు కార్డు కలిగిన సరస్వతికి రైతు ఫోన్ చేయగా ఆమె బంధువులు ఆమె మరణించిందని తెలపడంతో మరణించిన మహిళ పేరున కార్డు కొనసాగడంతో విచారణ అధికారులు అవాక్కయ్యారు. ఓ మహిళకు కారంపూడి, ఒప్పిచర్ల గ్రామాలలో కౌలుకార్డు ఉండటంతో అధికారుల పనితీరుపై రైతులు ఆశ్చర్యపోయారు. రైతులమైనా మాకు తెలియకుండా తమ పొలాలకు కౌలు రైతు కార్డులను సృష్టించి ప్రభుత్వం నుండి వచ్చే నగదును వాలంటీర్లు, అధికారులు పంచుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తమకు న్యాయం జరుగుతుందా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది మండలంలో సుమారు 1300 కౌలురైతు కార్డులు జారి చేశారు. ఇందులో ఎన్ని అక్రమ కార్డులు ఉన్నాయో, వాటిపై విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.

కానుకలేనా... ప్రసాదం పెట్టరా?

అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం
అధిక ధరలకు పూజాద్రవ్యాలు అమ్మితే చర్యలు
'ముక్కోటి' ఉత్సవాలపై సమీక్ష

విశాలాంధ్ర-మంగళగిరి: స్థానిక లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకునే భక్తుల నుంచి కేవలం కానుకలు స్వీకరించడమేనా ... కనీసం వారికి ప్రసాదమైనా పెట్టరా అంటూ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దేవస్థానం అధికారులపై మండిపడ్డారు. ఆలయ ప్రాంగణంలో జనవరి 2న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ముక్కోటి ఏర్పాట్లపై ముఖ్య అధికారులతో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆళ్ల చాలా సూచనలు చేశారు. ధరల పట్టికను ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా పానకం, పూజా ద్రవ్యాలపై అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాటు చేయాలని సూచించారు.తాను ఎటువంటి ప్రత్యేక పాసులు జారీ చేయడం లేదని తెలిపారు. ఎగువ సన్నిధి ఆలయంలో పానకం తయారీని ఏ రోజుకు ఆరోజు నాణ్యత పరిశీలన చేయాలని స్పష్టం చేశారు. ముక్కోటి ఏర్పాట్లకు ఎంటీఎంసీ కార్యాలయం నుంచి నోడల్ అధికారిని నియమించాలని కమిషనర్ శారదా దేవిని కోరారు. ప్రతిరోజు భక్తులకు ప్రసాదం అందించాలని అన్నారు. అనంతరం ఉత్సవాల గోడపత్రికలను ఆవిష్కరించారు. మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ శారదా దేవి, తహసీల్దార్ రాంప్రసాద్ పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

విశాలాంధ్ర -బాపట్ల : పరిశ్రమల స్థాపన, అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. చిన్న మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటు, అభివృద్ధిపై జిల్లాస్థాయి కమిటి ద్వితీయ సమావేశం బుధవారం స్థానిక కలెక్టరేట్లోని ఛాంబర్లో జరిగింది. పరిశ్రమల స్థాపనకు అనువైన పరిస్థితులు, వనరులున్న జిల్లాను పారిశ్రామిక రంగంగా అభివృద్ధి చేయాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. నూతనంగా ఏ.పి.ఐ.ఐ.సి.లో పరిశ్రమలు స్థాపించడానికి 11 ప్లాట్ల మంజూరుకు కలెక్టర్ ఆమోద ముద్ర వేశారు. వివిధ ప్రాంతాలలో పరిశ్రమలు ఏర్పాటుపై ప్రాధమిక సర్వే చేయాలని ఆదేశించారు. చీరాల ప్రాంతంలో 11 పరిశ్రమలు ఏర్పాటు కానున్నట్లు తెలిపారు. సింగిల్ డెస్క్ పోర్టల్ అమలు తీరుపై ఆమె సమీక్షించారు. సులభతర వాణిజ్య విధానంలో నిర్ణీత కాలవ్యవధిలో కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ, ప్రణాళికాశాఖ నుంచి అనుమతులివ్వడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బల్లికురువ, సంతమాగులూరు మండలాలలో గ్రానైట్ క్వారీలు ఉన్నందున అనుబంధ రంగ పరిశ్రమలు స్థాపించడానికి అనువైన ప్రాంతాలపై ప్రాధమిక సర్వే చేయాలన్నారు. అందుబాటులో ఉన్న వనరులపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

ఉత్పాదకత పెరగడానికి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను చైతన్య పరచాలని, ప్రభుత్వ రాయితీలపై అవగాహన కల్పించాలని ఆమె పలు సూచనలు చేశారు. ఆక్వాసాగు వృద్ధికోసం అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమలు, ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించేవారికి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలపై పూర్తి అవగాహన కల్పించి ప్రోత్సహించాలన్నారు. ఆటోనగర్ లో ఉత్పత్తి రంగాల అభివృద్ధికి సిక్కి, ఎస్సీ, ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఫాప్సియా ప్రతినిధులు సహకరించాలన్నారు. బాపట్లలో భావపురి రైస్ క్లస్టర్ ఫౌండేషన్, చీరాలలో శ్రీ శంకర మెడికల్ హెల్త్ కేర్ సంస్థ స్థాపనకు సంబంధించిన అనుమతులపై ఆమె చర్చించారు. పరిశ్రమలశాఖ జి.ఎమ్. మదన్మోహన్, ఏ.పి.ఐ.ఐ.సి. జడ్.ఎమ్. గోపికృష్ణ, ఎల్.డి.ఎమ్. కృష్ణానాయక్, ఉడా పి.ఓ. హిమబిందు, సిక్కి ఉపాధ్యక్షులు నారాయణ, మత్స్యకార అసోసియేషన్ జాతీయ ప్రధానకార్యదర్శి నగేష్, ఫ్యాప్సియా ప్రతినిధి భక్తవత్సలం, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంలో బీసీలకు అన్యాయం



విశాలాంధ్ర-వినుకొండ : జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో బీసీలకు జరిగిన అన్యాయంపై వినుకొండ మండల తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని బుధవారం రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి పొట్లూరు సైదారావు, న్యాయవాది టీడీపీ నాయకులు సిద్దయ్య, మీసాల మురళీకృష్ణ యాదవ్, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి షమీంఖాన్ అందజేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 50 శాతంపైగా ఉన్న బీసీలకు ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు తప్ప బీసీలకు ఒరిగిందేమి లేదని, బడ్జెట్ కేటాయింపుల్లో, నామినేటెడ్ పదవుల్లో, బీసీ కార్పొరేషన్ లోన్లు, బీసీ సంక్షేమాన్ని మంటగలిపిన ఈ ప్రభుత్వంపై ఇదేంఖర్మ మన బీసీలకు జగన్ రెడ్డి పాలెంలో 26 మంది బీసీలను హత్య చేశారని, 650 మంది బీసీ సోదరులపై దాడులు చేశారని చాలామంది మీద తప్పుడు కేసులు పెట్టారని అన్నారు. 56 బీసీ కార్పొరేషన్‌లకు వైసీపీ సర్కార్ ఒక రూపాయి కూడా ఇవ్వలేదని అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో బీసీ ఫెడరేషన్‌కు నిధులు కొరత రానివ్వలేదన్నారు. పెసల వెంకట నారాయణ, దుల్ల నాగార్జున, బైలాడుగి రామయ్య, నంబుల గురునాథ్, ఊడిగ గురవయ్య, కాటన్ వెంకట కోటేశ్వరరావు, తన్నీరు ఆంజనేయులు, బత్తుల బాలరాజు, బెల్లంకొండ సైదులు, వెంకటాచారి, ఆచారి, వెంకట కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు పంట రుణాలు అందజేయండి



విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: చిన్న, సన్నకారు, కౌలు రైతులకు పంట రుణాలు ఉదారంగా అందించేందుకు బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కలక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో త్రైమాసిక డీసీసీ, డిఎల్ఆర్సీ బ్యాంకర్ల సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ అభివృద్ధి పథకాలపై బ్యాంకర్లకు కేటాయించిన లక్ష్యాలు, అందించిన రుణాలపై లీడ్ బ్యాంకు మేనేజర్ ఈదర రాంబాబు సమావేశంలో వివరించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 30 వేల మంది కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు మంజూరు చేయగా, బ్యాంకర్లు 7630 మంది కౌలు రైతులకు రూ.40.85 కోట్లు మాత్రమే రుణాలు అందించడం జరిగిందని, మిగిలిన కౌలు రైతులకు రుణాలు వెంటనే మంజూరుకు బ్యాంకర్లు ఉదార స్వభావంతో చర్యలు తీసుకోవాలని కోరారు. హౌసింగ్, ఎడ్యుకేషన్ రుణాలకు బ్యాంకర్లు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి లబ్దిదారులకు రుణాలు అందించాలన్నారు. యూనియన్ బ్యాంకు అఫ్ ఇండియా రీజనల్ హెడ్ కుందన్ లాల్, ఆర్‌బిఐ మేనేజర్ పి.యం. పూర్ణిమ, నాబార్డ్ ఏజియం కే.ఆర్.డి. కార్తీక్, ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ తారకేశ్వర రావు, సీజీజీబి చైర్మన్ కామేశ్వర రావు, డీఆర్డీఏ, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్లు హరిహరనాథ్, వెంకట నారాయణ పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అభ్యసించాలి

విశాలాంధ్ర-రెంటచింతల: ప్రతి విద్యార్థి విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని, కన్నతల్లిదండ్రులను మరువరాదని, విద్యార్థుల భవిష్యత్ తరగతి గదుల్లోనే నిర్ణయించబడుతుందనే విషయాన్ని ప్రతి విద్యార్థి గమనించాలని రెంటచింతల సర్పంచ్ పూజల పుష్పావతి రామయ్య అన్నారు. స్థానిక అంబేద్కర్ కాలనీలోనున్న ప్రాథమిక పాఠశాలను, రేగులమాణ్యం కాలనీలోని స్కూలును బుధవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించాలన్నారు. విద్యాభివృద్ధికి సీఎం జగన్ ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనం చేసి పరిశీలించారు. కార్యదర్శి అనంత కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్స్ రాష్ట్ర మహాసభలకు...

విశాలాంధ్ర-నరసరావుపేట: ఒంగోలు పట్టణంలో జరుగుతున్న మున్సిపల్ వర్కర్స్ 5వ రాష్ట్ర మహాసభలకు నరసరావుపేట నుంచి మున్సిపల్ కార్మికులు బుధవారం ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి వైదన వెంకట్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. మూడు రోజులు పాటు జరుగుతున్న ఈ మహాసభలలో రాష్ట్ర నాయకత్వం చర్చలు జరిపి ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ యూనియన్ భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారని వైదన వెంకట్ తెలిపారు.యూనియన్ నాయకులు ఇక్రం, డేవిడ్, ఖాదర్, దీనమ్మ, మార్తమ్మ, వలి, ఏసు ఉన్నారు.

19న 'సామాజిక న్యాయం'పై ముఖాముఖి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న 'సామాజిక న్యాయం'పై రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.గోపాలరావుతో ఈ నెల 19న స్థానిక రామన్నపేట 1వ లైనులోని జనచైతన్య వేదిక రాష్ట్ర కార్యాలయంలో ముఖాముఖి కార్యక్రమం జరుగుతుందని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమన్వయకర్తగా ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు వ్యవహరిస్తారన్నారు. దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలు, మైనార్టీల అభివృద్ధికి గత ప్రభుత్వాలు అమలు చేసిన పథకాలు, వారి జీవన ప్రమాణ స్థాయి పెరిగి సామాజిక న్యాయం లభించడానికి ఏమేమి చర్యలు చేపట్టాలి లాంటి అంశాలపై గోపాలరావు తన ఆలోచనలను, భావాలను మేధావులతో పంచుకుంటారన్నారు. పేదల అభ్యున్నతి కోసం ఆలోచించే ప్రజా సంఘాల, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మేధావులు హాజరవ్వాలని విజ్ఞప్తి చేశారు.

అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయండి

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు నగరపాలక సంస్థ ఆవరణలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయించాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగ్-టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఈదులమూడి మధుబాబు ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు ఆయనకు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. రాజ్యాంగంలో ఎన్నో కార్మిక చట్టాలను పొందుపరచి కార్మికులు, ఉద్యోగులకు ప్రయోజనాలు చేకూర్చిన అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆయన జయంతి, వర్థంతుల సందర్భంగా కార్మికులు, ఉద్యోగులు ఆయనను స్మరించుకొనేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగరపాలక సంస్థ కమిటీ కోశాధికారి నాగిపోగు సుమన్, సభ్యులు పాల్గొన్నారు.

ఆడపిల్లల రక్షణపై అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర - కర్లపాలెం : ఆడపిల్లల రక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో ఎలీషాబాబు తెలిపారు. మండలంలోని పెదగొల్లపాలెం పంచాయతీ యారంవారిపాలెంలో మదర్‌థెరిస్సా గ్రామ సమైఖ్య ఆద్వర్యంలో వైఎస్సార్ క్రాంతిపథం సౌజన్యంతో లింగ వివక్షతపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో బాలికల సంరక్షణ మహిళా చట్టాలపై ప్రతిజ్ఞ చేశారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆడపిల్లలపై అత్యాచారాలు లింగ వివక్షత బాలికలపై అక్రమ రవాణా బాలిక లైంగిక వేధింపులు అరికట్టాలంటే మహిళా సంఘాలు పెద్ద ఎత్తున అవగాహన ఉద్యమం చేపట్టాలని మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. జడ్పీటీసి పిట్ల వేణుగోపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులు పందరబోయిన సుబ్బారావు, నాయకులు పేరాల వెంకట సురేష్ కార్యదర్శి షణ్ముఖరావు ఏ.ఈ దిలీప్ కుమార్, ఏపీఎం శ్రీనివాసరెడ్డి, ఏపీవో సురేష్ బాబు తదితరులున్నారు.

దత్తాత్రేయ జయంతిలో మక్కెన

విశాలాంధ్ర-వినుకొండ : వినుకొండ మండలం విఠంరాజుపల్లి సాయి బాబా దేవస్థానంలో శ్రీ హిమాలయ గురుజీ నిర్వహించిన శ్రీ దత్తాత్రేయ జయంతి మహోత్సవంలో వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు.

విలీన ప్రాంతాలకు కృష్ణా జలాలు అందించాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ళ రామకృష్ణారెడ్డి తాడేపల్లి ఈఎంసీ చీఫ్ ఇంజనీర్ ఆనంద్ బాబును బుధవారం కలిశారు. మంగళగిరి-తాడేపల్లి వేరువేరుగా ఉన్న సమయంలో ఏఐఐబి పథకం అంచనాలను రూపొందించారు. ప్రస్తుతం ఎంటీఎంసీగా రూపుదిద్దుకున్న తర్వాత వాటి అంచనాలు పూర్తిగా మారిపోయాయని, గతంలో 126 కిలోమీటర్లు పైప్ లైన్లు ఏర్పాటు చేయాలని అలాగే తొమ్మిది ఓవర్ ట్యాంకులు నిర్మించాలని అంచనాలు వేశారు. ప్రస్తుతం ఎంటీఎంసీలు విలీన గ్రామాలను కలుపుకుంటే సుమారు 350 నుంచి 400 కిలోమీటర్లు పైప్ లైన్లు వేయాల్సి వస్తుందని, ప్రస్తుతం జరుగుతున్న పనులతో పాటు విలీన గ్రామాల్లో కూడా పైపులైన్లు పనులు చేపిస్తే ఎంటీఎంసీ పరిధిలో పూర్తిగా కృష్ణా జలాలు ఇవ్వచ్చని ఎమ్మెల్యే ఆర్కే ఈఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ చీఫ్ ఆనంద్ బాబుకు వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆయన జిల్లా స్థాయి అధికారులతో కూడా మాట్లాడి అన్ని అనుమతులు ఇప్పిస్తామని తెలిపారు.

బీసీలకు వైసీపీ దగా: రాజు



విశాలాంధ్ర-బాపట్ల టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం బీసీలను నమ్మ పలికించి ఓటు బ్యాంకులకు వాడుకున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎమ్మెస్ రాజు అన్నారు. బుధవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ వేగేసిన నరేంద్ర వర్మ రాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సలగల రాజశేఖర్ బాబులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. రాజు మాట్లాడుతూ బీసీలను దగా పరిచిన పార్టీ వైసీపీ అని దుయ్యబట్టారు. తెలుగుదేశం పార్టీ బీసీలను అగ్రస్థానంలో నిలబెట్టి వారికి ఉన్నత పదవులను అలంకరింపచేసిన ఘనతను బీసీలు మర్చిపోకూడదన్నారు. వైసీపీ ప్రభుత్వం బీసీల కోసం ప్రత్యేకమైన కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు లేకుండా మొసలకన్నీరు కారుస్తున్నారని ఎద్దేవాచేశారు. అధ్యక్షులు శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా అయోధ్య స్వామి జయంతి

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : మండల పరిధిలోని 75 తాళ్లూరు అవధూత అయోధ్య స్వామి ఆశ్రమములో బుధవారం వేద పండితులు ఆధ్యాత్మిక గురువులు సుదురుపాటి హనుమంతరావు శర్మ ఆధ్వర్యంలో భక్తులచే ఉదయం గణపతి పూజతో ప్రారంభించి దత్త జయంతి మార్గశిర పూర్ణిమ సందర్భం పురస్కరించుకొని 5 గంటలకు కాకడ హారతి ప్రారంభమై భక్తులచే అయోధ్య స్వామికి పంచామృతాలతో అభిషేకాలు విశేష పూజ అలంకరణ భక్తులచే అనఘ దేవి వ్రతం వివిధ రకాల పూజలతో పాటు అయోధ్య స్వామికి పల్లకి సేవ నిర్వహించారు. భక్తులచే దిగంబరా దిగంబరా అంటూ దత్తుని నామం నిర్వహించి గురు చరిత్ర పారాయణము నిర్వహించారు. మాట్లాడుతూ ఏ గ్రామంలో దత్త జయంతి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారో ఆ గ్రామంలో పాడి పరిశ్రమ అష్టసిద్ధులు సిద్ధిస్తాయని ఆయన అన్నారు.

పీఆర్సీ బకాయిలు చెల్లించండి

కలెక్టరేట్ వద్ద ఎస్టీయూ నేతల ధర్నా

విశాలాంధ్ర - బాపట్ల : ఈ ఏడాది మార్చిలో చెల్లిస్తామని చెప్పిన నేటికి పీఆర్సీ బకాయిలు చెల్లించలేదని వెంటనే చెల్లించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద ఎస్టీయూ నాయకులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఎస్టీయూ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు జిల్లా అధ్యక్షులు బడుగు శ్రీనివాసరావు ప్రధాన కార్యదర్శి గుడివాడ అమర్నాథ్ ఆధ్వర్యంలో డిమాండ్‌లు నెరవేర్చాలని దీక్షలో నినదించారు. జిల్లా అధ్యక్షులు బడుగు శ్రీనివాసరావు మాట్లాడుతూ పీఆర్సీ అమలు అనంతరం ప్రకటించాల్సిన రెండు డిఏలు ఇంతవరకు ప్రకటించలేదని తక్షణమే ప్రకటించి బదిలీలు, పదోన్నతులు షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి అమర్నాథ్ మాట్లాడుతూ , 2019 నుంచి ఇప్పటివరకు ఎటువంటి డి.ఏ ఎరియర్స్ సిపిఎస్ ఉద్యోగులకు జమ చేయలేదని, వెంటనే అవి జమ చేయాలన్నారు. మెడికల్ బిల్ మంజూరులో జాప్యాన్ని నివారించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయవాణి జిల్లా కన్వీనర్ పీవీ నాగరాజు మాట్లాడుతూ జీతాలు చెల్లింపులో జాప్యం సరికాదని అన్నారు. జిల్లా మైనారిటీ కన్వీనర్ నూరుబాష సుభాని మాట్లాడుతూ బోధనకు ఆటకం కలిగిస్తున్న యాప్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. ఆర్థిక కార్యదర్శి వి. ప్రభాకర్, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ బొంత వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి జి. ఉదయ్ శంకర్,షేక్ ఆదాంబి, రత్నజ్యోతి,పరిశుద్ధరవు,గుడారంకయ్య,ఏవీ నారాయణ, పీఎస్‌వీ ప్రసాద్, టి.శివయ్య, ఏసురత్నం, ఈమని సాంబశివరావు, మూర్తి పాల్గొన్నారు.

వీర నారీమణులకు వందనాలు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: దేశ రక్షణ కోసం పాటు పడిన సైనికులు, మాజీ సైనికులకు, వారి కుటుంబ సభ్యులను పోగొట్టుకున్న వీర నారీమణులకు వందనాలు తెలుపుతున్నానని జిల్లా సైనిక బోర్డు చైర్మన్, కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం ఆవరణలో బుధవారం సాయుధ దళాల పతాక దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. తొలుత కలెక్టర్, సంయుక్త కలెక్టర్ వార్ మెమోరియల్ స్థూపం వద్ద పూల గుచ్చాలు వుంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఆనంతరం కలెక్టర్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పిస్తున్న వారి త్యాగాలను స్మరిస్తూ సాయుధ దళాల పతాక దినోత్సవం జరుపుకోవడం మరువలేని అనుభూతి అని అన్నారు. సీఎం ఆదేశాల మేరకు 23 మందికి ఇంటి పట్టాలను అందివ్వడం జరిగిందన్నారు. సంయుక్త కలెక్టర్ రాజ కుమారి మాట్లాడుతూ కుటుంబాన్ని వదిలి దేశ రక్షణ కోసం విధులు నిర్వర్తించిన సైనికులను ఎంత ప్రశంసించినా తక్కువ అవుతుందన్నారు. ఎన్‌సీసీ గ్రూప్ హెడ్ క్వార్టర్ కామాండెంట్ కర్నల్ జయకుమార్, రిటైర్డ్ జిల్లా సైనిక వెల్ఫేర్ అధికారి మేజర్ వి.ఆర్.కే.చారి, జిల్లా సైనిక సంక్షేమ అధికారిణి ఆర్.గుణ శీల, డిప్యూటీ కలెక్టర్లు సాయిశ్రీ, మోవిడి వాణి, డిఆర్ఓ కే.చంద్ర శేఖర రావు, ఆర్డీవో ప్రభాకర రెడ్డి, తూర్పు మండల తహశీల్దార్ రిజ్వాన్ సైనిక వెల్ఫేర్ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలపై చిత్తశుద్ధిని నిరూపించుకోండి

ముస్లిం జేపీసీ అధ్యక్షుడు ఎండీ కలీం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : బీసీ లకు చట్టసభల్లో అత్యధిక సీట్లు కేటాయించి బీసీల పట్ల అధికార, ప్రతిపక్ష పార్టీలకు ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ముస్లిం యునైటెట్ ఫ్రంట్, ముస్లిం జేఏసీ అధ్యక్షులు ఎండీ కలీం సూచించారు. గత 40 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచిన బీసీ వర్గాలకు రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటన చేసి బీసీల పట్ల తనకున్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ ముస్లిం జేఏసీ అధ్యక్షులు ఎండి కలీం తెలిపారు. పాత బస్టాండ్ మాయాబజార్ లో ఉన్న ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ లకు కావాల్సింది రాజ్యాధికారంలో వాటా అని, అధికారంలేని పదవులు కాదన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. జగనన్న గృహ నిర్మాణాల పనుల పురోగతిపై బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, లబ్ధిదారులకు మెప్మా నుండి బ్యాంక్ రుణాలను ఇప్పించాలని తెలిపారు. జగనన్న లే ఔట్స్‌లో విద్యుత్, రోడ్లు, త్రాగునీరు, సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. మెప్మా అధికారుల పనితీరు బాగా లేదని స్వయం సహాయక సంఘాలకు రుణాలను అందించడములో నిర్లక్ష్యం చేశారన్నారు. జిల్లాలో మంజూరు చేసిన 25 జగనన్న లే ఔట్ కాలనీల ఆర్చీల పనులు వెంటనే మొదలు పెట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ గృహ నిర్మాణ పథకం క్రింద 16 వేల గృహాల నిర్మాణాలు లక్ష్యంగా ఇచ్చామని ఇప్పటికే 7764 గృహాలు గ్రౌండింగ్ చేయడం జరిగిందని అన్నారు. కాలనీల్లో మేరక పెంచుకోవడానికి ప్రభుత్వం రూ.11 కోట్లు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.రవికుమార్, బాపట్ల మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్, గృహ నిర్మాణ శాఖ డి.ఇ.ఇ లు తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి 'లోనా నావ'లో షూటింగ్

విశాలాంధ్ర-తెనాలి : దర్శకుడు రత్నాకర్ కనపర్తి ఆధ్వర్యంలో లోనా నావలో అనే క్రిస్మస్ ప్రత్యేక వీడియో ఆల్బమ్ షూటింగ్ ఈనెల 12నుంచి ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా ల్బమ్ నిర్మాణ సంస్థ జోవెన్ ఫిల్మ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక సరళనగరలో విలేఖర్ల సమావేశం నిర్వహించారు. నా నావలో ఆల్బలం సంబంధించి ప్రచార పోస్టర్స్‌ను అమిరినేని వెంకట ప్రసాద్ ఆవిష్కరించారు. దర్శకుడు రత్నాకర్ మాట్లాడుతూ గతంలో జోవెన్ బ్యానర్‌లో నీల కోటేశ్వరరావు నిర్మాతగా హృదయతార వీడియో ఆల్బలంను రూపొందించామని చెప్పారు. ప్రొఫెసర్ సుధాకర్ రచించిన పాటకు శ్రీపతి రాముడు సంగీత దర్శకత్వం వహించగా ప్రముఖ సంగీత దర్శకుడు, గాయకుడు, నటుడు ఆర్పీ పట్నాయక్ గానం చేశారన్నారు. ఇందులో మాస్టర్ జోయల్ సుధాకర్‌తో పాటు స్థానిక కళాకారులతో షూటింగ్ జరుగుతుందన్నారు. అమ్మ సుధీర్ గోఇనేని, కొంద్రు కిరణ్‌లు నృత్య దర్శకత్వం వహిస్తున్నారని చెప్పారు. చీరాల, నిజాంపట్నం సముద్రతీరంలో షూటింగ్ జరుగుతుందన్నారు. సమావేశంలో లైన్ ప్రొడ్యూసర్ మునిపల్లి శ్రీకాంత్, డిఓపిలు కొమరాబత్తుని నాగరాజు, దేవరపల్లి మధు, ప్రొడక్షన్ ఇన్‌చార్జి మధుకర్, కో డైరెక్టర్ ఎస్ఎస్‌వి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్‌కు 'బహుముఖ కళాప్రపూర్ణ బిరుదు'

విశాలాంధ్ర-వినుకొండ : జెస్టిస్ జన్మస్థలం సత్తెనపల్లిలో, ఘంటసాల వెంకటేశ్వరరావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఉషోదయ కళా పరిషత్ ఘంటసాల కళానిలయం పత్రి మెమోరియల్ ప్రగతి కళాపరిషత్ కంఠమనేని మెమోరియల్ ట్రస్ట్ సత్తెనపల్లి పలు కళారంగాలు, సాహితీ రంగాలు ప్రముఖులు, మిత్రులు శ్రేయోభిలాషుల ఆధ్వర్యంలో జాతీయ యునెస్కో అవార్డు గ్రహీత, ప్రముఖ చిత్రకారుడు జెస్టిస్ దంపతులకు ఘనమైన సత్కారం జరిగింది. ప్రముఖులు సమక్షంలో 'బహుముఖ కళాప్రపూర్ణ బిరుదు'ను అందించారు. కంఠంనేని వెంకటేశ్వరరావు, మాతంగి సాంబశివరావు, జవంగుల శ్రీనివాస్ నిర్వహణలో మాతంగి సాంబశివరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వినుకొండ ప్రముఖులు, కళాకారులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, కవులు, పాస్టర్లు జెస్టిస్‌కు అభినందనలు తెలియజేశారు.

ఫెన్సింగ్‌లో ఏఎంజీ విద్యార్థి ప్రతిభ

విశాలాంధ్ర-చిలకలూరిపేట: కాకినాడలోని జిల్లా పరిషత్ కళ్యాణమండపంలో ఈ నెల 5, 6 తేదీలలో ఏపీ అంతర్ జిల్లాల ఫెన్సింగ్ పోటీలు నిర్వహించారు. ఏఎంజీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థి కర్రి మన్‌జీత్ గుంటూరు జిల్లా తరఫున 18 సంవత్సరాల విభాగం వ్యక్తిగత పోటీలలో క్యాంస్య పతకం సాధించాడు.జాతీయ ఫెన్సింగ్ పోటీలలో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించనున్నాడు. బుధవారం ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణకుమార్ మహంతి, జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి శ్యామ్ క్రిస్టొఫర్, పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కోటేశ్వరరావు, స్కూల్ హెచ్ఎం పి మేరి అభినందించారు.

'కడప ఉక్కు' నిర్మాణం తక్షణమే చేపట్టాలి

సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్

విశాలాంధ్ర-నరసరావుపేట: రాష్ట్ర విభజన హామీలలో భాగంగా ప్రత్యేక హోదా ఇస్తానని చెప్పిన బీజేపీ మాట తప్పి ఆంధ్రులను మోసం చేసిందని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఏ.మారుతి వరప్రసాద్ అన్నారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో కడప ఉక్కు ఫ్యాక్టరీ పోరాట పాదయాత్ర గోడపత్రికలను బుధవారం ఆయన ఆవిష్కరించారు.

అనంతరం వరప్రసాద్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందకూడదనే దురుద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ఏపీకి ప్రత్యేక తరగతి హోదా ఇవ్వలేదని అన్నారు. సీఎం జగన్ కూడా ప్రత్యేక హోదా ఊసే ఎత్తడం లేదని, ఎంతో మంది విద్యార్థుల బలిదానంతో లెఫ్ట్ పార్టీల ఎమ్మెల్యేల పదవీ త్యాగంతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కూడా బీజేపీ ప్రభుత్వం పోస్కో కంపెనీకి అమ్మకానికి పెడితే ఎమ్మెల్యేలు, ఎంపీలు కానీ కనీసం నోరు కూడా మెదపలేదని విమర్శించారు. 2007 జూన్ 10న దివంగత సీఎం రాజశేఖర్ రెడ్డి కడప ఉక్కు ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేశారని, ఆయన చనిపోవడంతో నిర్మాణం ఆగిపోయిందని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో 2011 నుంచి ఉక్కు పరిశ్రమ కోసం ఉద్యమాన్ని ప్రారంభించడం జరిగిందని చెప్పారు. 2019లో చంద్రబాబు కూడా కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మిస్తానని చెప్పి శంకుస్థాపన చేయడం జరిగిందని గుర్తుచేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ వచ్చిన ఫ్యాక్టరీ పనుల్లో ఎటువంటి పురోగతి లేదని అన్నారు. కడప ఉక్కు పరిశ్రమ ఏర్పడితే ప్రత్యక్షంగా 28 వేల మందికి పరోక్షంగా లక్ష మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు.కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు కడపలో జరిగే పోరాట పాదయాత్రకు విద్యార్థులు యువకు లతో పాటు రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ సుభాని, సీపీఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, సీనియర్ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, సురేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కథ... భాష కంటే ప్రాచీనమైంది

ప్రముఖ నాటక రచయిత మల్లెల శ్రీనివాసరావు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : కథ భాష కంటే ప్రాచీనమైందని ప్రముఖ నాటక రచయిత మల్లెల శ్రీనివాసరావు అన్నారు. కథ ఎప్పుడు పుట్టిందంటే ఎవరూ చెప్పలేరని, కానీ కథ మనిషితో పాటు పుట్టిందని చెప్పారు. స్థానిక లాడ్జిసెంటర్‌లోని ఏఎల్ బీఈడీ కళాశాలలో ఏర్పాటు చేసిన గుంటూరు విశాలాంధ్ర 22వ పుస్తక మహోత్సవాలలో భాగంగా అరసం ఆధ్వర్యంలో అభ్యుదయ సాహిత్యవేత్త ముత్యాల ప్రసాద్ సాహితీ వేదికపై బుధవారం సాయంత్రం 'కథ చెప్పండి' అంశంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లె శ్రీనివాసరావు మాట్లాడుతూ సైగలు రూపం, మౌఖిక భాషా రూపం, లిఖిత రూపం అనే మూడు రూపాలను కథ కలిగి ఉంటుందన్నారు. ప్రాచీన మానవుడు తన వేట అనుభవాలను తోటి వారికి సైగల రూపంలో చెప్పడంతో కథ మొదలైందని, తరువాత భాష ఏర్పడి అవే అనుభవాలకు చిత్ర, విచిత్ర పదాలతో వారికి కొంత నేర్పరితనంతో ఎదుటివారికి ఆసక్తి కలిగేలా కథ చెప్పడంతో మౌఖిక భాషా రూపం ఏర్పడినట్లు చెప్పారు. లిపి ఏర్పడిన తరువాత లిఖిత రూపంలోకి వచ్చింది కథ అని, కథలో అంతర్లీనంగా సత్యం దాగుంటుందని, అంతర్వాహినిగా సామాజిక పరిస్థితులు కూడా ఉంటాయని శ్రీనివాసరావు వివరించారు. కథ సాంస్కృతిక రూపం మిళితమై ఉంటుందని, కథ పొడవుగా ఉండరాదని, పొందికగా ఉండాలని అగ్నిపురాణం తెలిపినట్లు ఆయన అన్నారు. గుంటూరు కొరిటిపాడులోని ఆర్‌సీఎం యూపీ స్కూల్ ఉపాధ్యాయులు ఇ.అనిల్‌కుమార్ మాట్లాడుతూ పిల్లలు చెప్పే కథ బట్టీ రూపంలో కాకుండా తన భాషలో చెప్పేటట్టుగా ఉండాలని సూచించారు. అరసం జిల్లా కార్యవర్గ సభ్యులు, బుల్లా రవిబాబు మల్లెల శ్రీనివాసరావు, అనిల్‌కుమార్‌లను వేదికపైకి ఆహ్వానించారు. శ్రీవెంకటేశ్వర బాలకుటీర్, యాస్మిక్ కిడ్స్ స్కూల్, భాష్యం, సెంట్రల్ స్కూల్, నారాయణ స్కూల్, ఓరియంటల్ స్కూల్, కెఎల్‌పీ స్కూల్స్ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు విశాలాంధ్ర బుక్‌హౌస్ మేనేజర్ మురకొండ మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు :

గురువారం ఆరున్నర గంటలకు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పుట్టి శంకరరావు నిర్వహణలో , భారతీయ ప్రజానాట్య మండలి కార్యదర్శి గని అధ్యక్షతన 'అభ్యుదయ గీతాలు'పై విద్యార్థులకు పోటీలు జరగనున్నాయి.

జీవనోపాధికి పూచికత్తు లేని రుణాలు

విశాలాంధ్ర - బాపట్ల : జీవనోపాధుల అభివృద్ధి కోసం స్టాండప్ ఇండియా పథకం కింద పూచికత్తు లేని రుణాలు విరివిగా అందజేస్తున్నామని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బాపట్లలో అధికంగా రుణాలివ్వాలని ఎల్.డి.ఎమ్. కృష్ణానాయక్‌ను ఆదేశిస్తూ కలెక్టర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో 240 వివిధ బ్యాంక్ బ్రాంచ్లు ఉన్నాయని 177 దరఖాస్తులు బ్యాంకులకు వచ్చాయన్నారు. లబ్ధిదారులు ఏర్పాటు చేసుకునే యూనిట్లకు రూ.29.15 కోట్లు మంజూరు చేశామన్నారు. ప్రతి బ్యాంకు బ్రాంచి పరిధిలో ఇద్దరికి రుణాలిస్తామన్నారు. రూ. 10 లక్షల నుంచి గరిష్టంగా రూ. ఒక కోటి వరకు ఎలాంటి హామీలేని రుణాలు ఈ పథకం ద్వారా లబ్ధిదారులు పొందవచ్చన్నారు. వ్యవసాయ అనుబంధ రుణాలు, ఉత్పత్తి రంగాలు, సేవా రంగాలకు సంబంధించిన యూనిట్లకు అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. యూనిట్ ఏర్పాటులో 85 శాతం బ్యాంకులు రుణంగా ఇస్తాయని, మిగిలిన 15 శాతం లబ్ధిదారుడి వాటా ఉంటుందన్నారు. స్వయం ఉపాధితో అభివృద్ధి చెందాలనే ఆసక్తిగలవారంతా బ్యాంకులను సంప్రదించాలన్నారు. ప్రభుత్వం కల్పించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధ్యాయులను నియమించండి

రోడ్డెక్కిన మాడుగుల విద్యార్థులు

విశాలాంధ్ర-గురజాల: స్కూల్లో దాదాపు 160 మంది విద్యార్థులు ఉన్నాం కానీ మాకు చదువు చెప్పేందుకు ఇద్దరే ఉపాధ్యాయులు ఉన్నారు అంటూ మాకు వెంటనే అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులను నియమించాలని గత నెల 27వ తేదీన మండలంలోని మాడుగుల జడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులు పట్టణంలోని బ్రహ్మనాయుడు విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి సమస్యను అధికారులు దృష్టికి తీసుకొని వెళ్లారు. అయితే ఉన్నతాధికారులు స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుని సస్పెండ్ చేయడంతో విద్యార్థులు మరలా రోడ్డు ఎక్కారు. మండలంలోని మాడుగుల గ్రామం నుండి గురజాల పట్టణం వరకు సుమారు ఎనిమిది కిలోమీటర్ల మేర తమ తల్లిదండ్రులతో కలిసి పాదయాత్ర చేసుకుంటూ వచ్చి స్థానిక తాసిల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు.

విద్యార్థులకు టీడీపీ నేతలు సంఘీభావం తెలిపారు. మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పలువురు నేతలు విద్యార్థులకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. అనంతరం విద్యార్థులు తమ సమస్యను తహసిల్దార్ దానియేలు దృష్టికి తీసుకొని వెళ్లే అర్జీ రూపంలో అందజేశారు. ఉన్న ఇద్దరిలో ఒకరిని సస్పెండ్ చేయడంతో తాము పరీక్షలు ఎలా ఎదుర్కోగలం అంటూ విద్యార్థులు తహసీల్దార్ వద్ద తమ గోడు వినిపించారు. సంఘటన స్థలానికి చేరుకున్న సిఐ ప్రభాకర్ విద్యార్థులకు నచ్చజెప్పి ప్రైవేట్ వాహనం ద్వారా విద్యార్థులను తమ గ్రామానికి తీసుకొని వెళ్లారు.

ముగిసిన శిక్షణా తరగతులు

విశాలాంధ్ర-ఫిరంగిపురం: ఈ నెల ఒకటవ తేది నుంచి 7వ తేది వరకు స్థానిక మండల ప్రజా పరిషత్ మీటింగ్ హాల్లో వారం రోజులు పాటు ఆయా శాఖలకు సంబంధించి అభివృద్ధి పనులపై జరిగిన సర్పంచ్‌లు, ఎంపీటీసీల శిక్షణా తరగతులు బుధవారంతో విజయవంతంగా ముగిశాయి. ముగింపు సభా కార్యక్రమంలో ఎంపిపి షేక్.షమెళా నర్గీస్, జడ్పీటీసి దాసరి కత్రేణమ్మ, ఎంపిడివో దాసరి అనురాధ పాల్గొని ప్రభుత్వ ఆదేశాల మేరకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి గ్రామ మరియు బ్లాక్ స్థాయి పంచాయతీరాజ్ సంస్థల ప్రణాళికల తయారీలో భాగంగా మండల స్థాయి నందు మండలంలో ఆయా అభివృద్ధి పనులపై సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై జిపిడిపి మరియు బిపిడిపికి సంబందించి ప్రతి గ్రామానికి ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాల్లో జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన అధికారులచే అవగాహన పొందిన లక్ష్యాలను గ్రామ ప్రజాప్రతినిధులందరు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మండల, గ్రామ అభివృద్ధిపై సహకారం అందించి కృషి చేయాలని కోరారు. వారం రోజులు శిక్షణా తరగతులు విజయవంతం కావడానికి కృషి చేసెయిహోపిఆర్డి ఎంఎస్ఎల్.కుమారి, జవిఆర్‌కె.మూర్తి, సత్యానంద్ ఆయా శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులకు అభినందనలు తెలిపారు.

విద్యా జ్యోతి పుస్తకాలు అందజేత

విశాలాంధ్ర-ఫిరంగిపురం: రాష్ట్ర ముఖ్యంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పేద విద్యార్థుల చదువులు కోసం కల్పించిన సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటిసి దాసరి కత్రేణమ్మ కోరారు. మండలంలోని బేతపూడి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం కల్పించిన విద్యాజ్యోతి పుస్తకాలను బుధవారం జడ్పీటిసి చేతులు మీదుగా అందజేశారు. అదియేగాక మధ్యాహ్నం భోజనం పథకాన్ని పరిశీలించి పాఠశాల హెచ్‌యంను బాగోగుల వివరాలను అడిగితెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి జడ్పీటిసితో పాటు బేతపూడి గ్రామ ఎంపిటిసి కాశిం షహీద్, సొసైటీ ప్రెసిడెంట్ జాకీర్, హెచ్‌యం తదితరులు భోజనం చేశారు.

బేతపూడిలో వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-ఫిరంగిపురం: నుదురుపాడు పిహెచ్‌సి ఆధ్వర్యంలో జిల్లా మలేరియా వైద్యాధికారి సుబ్బరాయనం గ్రామంలో చైతన్య నగర్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం మలేరియా పరీక్షలు నిర్వహించి మలేరియా నివారణపై విద్యార్థులకు, గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. డా. టి.అనిరుధ్ పర్యవేక్షణలో విద్యార్థులకు ఫైలేరియా వలన వచ్చు వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమలు మరియు నివాస ప్రాంతాల్లో మురుగు కాలువల వలన వచ్చు వ్యాధుల గురించి వాటి నివారణపై అవగాహన కల్పించారు. నిత్యం ప్రజలు పరిశుభ్రంగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో నుదురుపాడు పిహెచ్‌సి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బహుళ జాతి సంస్థలకు అనుమతులు ఇవ్వొద్దు

విశాలాంధ్ర-వినుకొండ : నియోజకవర్గ నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక కమిషనర్ బి.శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. ఇందులో భాగంగా వినుకొండలోని నాయి బ్రాహ్మణ కులస్తులు మాట్లాడుతూ వేలాది సంవత్సరాల నుంచి చేతివృత్తుదారులుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమకు కొన్ని జీవోలు ఇచ్చారని, తాము చౌర వృత్తి చేసుకుని జీవిస్తున్నామన్నారు. ఈ మధ్య రిలయన్స్ కంపెనీ లాంటి బహుళ జాతీయ సంస్థలు మా వృత్తిలోకి వస్తున్నట్లు తెలుస్తోందని, రిలయన్స్, ఇతర బహుళ జాతీయ సంస్థలకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. బహుళ జాతీయ సంస్థలు మా వృత్తిలోకి రాకుండా నిషేధించి నాయి బ్రాహ్మణ కార్పొరేషన్‌కి నిధులు కేటాయించాలని, వాయిద్య కళాకారులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, నాయి బ్రాహ్మణులపై దాడులు జరగకుండా ఇచ్చిన జీవో నెంబర్ 50కు సవరణలు చేసి తగు చట్టబద్ధత కల్పించాలని, ఆదరణ పథకమునకు నాయి బ్రాహ్మణులు కట్టిన అమౌంట్‌లు తిరిగి లబ్ధిదారులకు ఇవ్వాలని కోరారు. భీమవరపు ఏడుకొండలు, ఎం.రమేష్, బి.శ్రీనివాసరావు, కె.శివశంకర్, ఎం.ప్రసాద్, ఎం.రామయ్య, ఈదర శ్రీనివాసులు, రావిపాటి వీరయ్య, ఎం.లక్ష్మీనరసయ్య, ఏ.వాసు నారాయణ, పీఎస్ ప్రసాద్, ఎం.వీరస్వామి, రామాంజి,శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు వేద విద్యార్థులు

విశాలాంధ్ర-చిలకలూరిపేట: స్థానిక వేద పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు జాతీయస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. గతంలో చింతలపూడిలో జరిగిన రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలలో పల్నాడు జిల్లా తరఫున ఆడి జాతీయ స్థాయికి ఎంపికైన పాఠశాల విద్యార్థులు జీ.జితేంద్ర, పి. జాన్సన్ తదుపరి జరిగే జాతీయస్థాయి పోటీలు డిసెంబరు 8 నుండి 11 వరకు జమ్మూలో జరగనున్నాయి. విద్యార్థులను డైరెక్టర్ పెర్సీ స్వరూప విద్యార్థులను అభినందిస్తూ విద్యతోపాటు క్రీడలలో రాణిస్తున్నందుకు సంతోషాన్ని వ్యక్తపరిచారు.

'స్కిల్' అవినీతినిరూపించాలి: లోకేశ్

విశాలాంధ్ర-మంగళగిరి: తనపైనా, తెలుగుదేశం అధినేతపైనా, ఆరోపణలు చేయడం పారిపోవడం ఏ1, ఏ2 లకు అలవాటుగా మారిందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు."డిపి ఐదేళ్ల పాలనలో ఒక్క తప్పు చేయలేదని, ఏ ఆరోపణ అయినా నిరూపించగలిగారా అని వైసీపీకి సవాల్ విసిరారు. మంగళగిరి నియోజకవర్గం నిడమర్రులో బుధవారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలు నమోదు పత్రాలు ప్రజలకి ఇచ్చి వారి సమస్యలను సేకరించారు. స్థానికులు గ్రామంలో తమ సమస్యలు వివరించి పరిష్కరించాలని కోరారు. తమ ఇళ్లు కూల్చివేతకు నోటీసులు ఇచ్చారని మహిళలు గోడు వెళ్లబోసుకోగా, న్యాయపోరాటం చేసి అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. మంగళగిరి నియోజకవర్గంలో పేదలకు 10వేల ఇళ్లు కట్టించి తీరుతానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మీడియాతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు తనపై అనేక ఆరోపణలు చేశారని, అధికారంలోకి వచ్చి కూడా అనేక ఆరోపణలు చేస్తున్నారని...దమ్ముంటే ఏ ఒక్క ఆరోపణ అయినా నిరూపించాలని సవాల్ విసిరారు. స్కిల్ డవలప్మెంట్ స్కాం అంటూ ఆరోపణలు చేస్తున్న ప్రభుత్వం 24 గంటల్లో ఆధారాలు చూపాలని ఛాలెంజ్ చేస్తే పారిపోయిందని ఎద్దేవ చేశారు. నాడు పింక్ డైమండ్ అన్నారు, దసపల్లా భూములు కొట్టేశానన్నారు. అగ్రిగోల్డ్ నేనే చేశానన్నారు, ఫైబర్ గ్రిడ్ లోనూ ఆరోపణలు చేసిన జగన్ రెడ్డి గ్యాంగ్ ఒక్క ఆరోపణ కూడా ఎందుకు నిరూపించలేకపోయారని ప్రశ్నించారు.

జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్ల అయ్యిందని, 50 మంది టిడిపి నాయకులపై అక్రమకేసులు పెట్టారని, ఒక్క కేసు అయినా నిలబడిందా అని నిలదీశారు. తప్పుడు ఆరోపణలు చేసిన వారందరిపైనీ పరువునష్టం కేసు వేస్తానని లోకేష్ హెచ్చరించారు. టిడిపి హయాంలో బిసి కార్పోరేషన్ ద్వారా 4 వేల కోట్లు, ఒక్క ఆదరణ ద్వారానే వెయ్యి కోట్లు ఖర్చుపెట్టామని, జగన్ రెడ్డి పాలనలో బీసీల కోసం ఖర్చు చేసింది సున్నా అని వివరించారు.

లక్ష్మీనారాయణకు డాక్టరేట్

విశాలాంధ్ర-తెనాలి : మండల విద్యాశాఖాధికారి ఎం.లక్ష్మీనారాయణకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రధానం చేశారు. విద్యలో ఉపాధ్యాయుల బోధన నైపుణ్యాలను మెరుగు పరిచేందుకు వృత్యంతర శిక్షణా కార్యక్రమాలు వారి యొక్క ఉపాధ్యాయ అభివృద్ధికి ఏ విధంగా దోహదపడుతుంతో వివరించారు. ఉపాధ్యాయులు మరింత ఎఫెక్టివ్‌గా బోధించడానికి వృత్యంతర శిక్షణ అవసరమనే విషయంపై పరిశోధనా పత్రాలను సమర్పించడం జరిగింది. డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని పర్యవేక్షణలో ఆచార్య నాగార్జున యూనివర్శిటీకి సమర్పించిన పరిశోధనా పత్రాలకు గాను యూనివర్శిటీ నుండి డాక్టరేట్ ప్రధానం చేయడం జరిగిందన్నారు. బుధవారం ఎంఈవో కార్యాలయంలో ఎస్టీయు ఎపి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎస్.రామచంద్రయ్య, ఎ.వి.గోపాలరావు, ఇ.అంబరీషుడు, పి.శ్రీనివాసరావు, వి.అంకినీడు ప్రసాద్, టి.సాంబశివరావు, దివాకర్, పి.వెంకటేశ్వర్లు, ఎం.వి.రఘునాధరావు, ఈశ్వర్, దినేష్, సుబ్బారెడ్డి, లలితబాబు పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

విలేకరుల సేవలు అభినందనీయం

విశాలాంధ్ర-తెనాలి : సమాజంలో విలేకర్ల సేవలు అభినందనీయమం అని ప్రవాసాంధ్రుడు అమిరినేని ప్రసాద్ అన్నారు. స్థానిక జెఎంజె కళాశాల వద్ద గల ఆయన నివాసంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. వెంకట్‌ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తూ సమాజాన్ని చైతన్య వంతం చేస్తున్నామన్నారు. ప్రభుత్వం పాత్రికేయుల సంక్షేమానికి శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఫెడరేషన్ డివిజన్ అధ్యక్షుడు ఎం.రవికుమార్ మాట్లాడుతూ ఫెడరేషన్ సభ్యులకు ఇటీవల పోస్టల్ ఇన్యూరెన్స్ కల్పించినట్లు, అందుకు ఆర్థిక సహకారం తన వంతుగా సహకరించిన వెంకట్ ప్రసాద్ అభినందనీయమన్నారు. వెంకట్‌ప్రసాద్‌ను ఫెడరేషన్ నాయకులు అంబటి శ్యామ్‌సాగర్, పి.పున్నయ్య, డి.కోటేశ్వరరావు, జి.ప్రభాకర్, ప్రకాశరావు, జహీర్‌లు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కనపర్తి రత్నాకర్, మునిపల్లి శ్రీకాంత్, ప్రేమ్‌కుమార్, శేఖర్, భూషణం, సుబ్బారావు, కిరణ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పరిశీలన



విశాలాంధ్ర - నకరికల్లు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా జరుగుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం మండలంలోని చీమలమర్రి గ్రామ పంట పొలాల్లో కొనసాగుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడ రైతులు, సర్వే నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడారు. రైతులకు ఇబ్బంది లేకుండా సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సురేష్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

గుంటూరు సిటీ, సంపత్‌నగర్, బాబూరాజేంద్ర కాలనీ 5/3వ లైను, డోరు నెం.25-19-34/1 రు కాపురస్తులు **బొంతా రమణారెడ్డి** గారి కుమారుడు **బొంతా రంగారెడ్డి** (సెల్ : **8886111138**) అను నేను నా పేరిట గల పాస్‌పోర్ట్ నెం. **L2209800** ఒరిజినల్‌ను **ది.10-08-2022**న నా ఇంటి వద్ద నుండి చౌత్రాసెంటర్‌కు ఫోటోస్టాట్ నిమిత్తం బైకుపై వెళ్లుచుండగా మార్గమధ్యలో పోగొట్టుకున్నాను. ఎవరికైనా సదరు పాస్‌పోర్ట్ దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

మహారాజశ్రీ గురజాల సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.P.NO.16/2016

బిట్వీన్ :-
కందుల నరసింహారావు - పిటీషనర్
మరియు
1. చేపూరి వెంకట రమణారావు మరియు 52 మంది ఇతరులు - రెస్పాండెంట్స్
To
R1 : చేపూరి వెంకటరమణారావు S/o. శ్రీరాములు, R/o. లూప్‌లైను అపార్ట్‌మెంట్
R2 : అమడ వెంకట్రావు S/o. సిద్ధయ్య, R/o. నెహ్రూనగర్, 2వలైను
R3 : అమడ కృష్ణారావు S/o. ఆంజనేయులు, R/o. నెహ్రూనగర్, 2వలైను
R4 : కొమ్మారెడ్డి, రామిరెడ్డి S/o. శ్రీనివాసరెడ్డి, R/o. ఎస్‌బీఐ బ్యాంకు వద్ద
R8 : రెడ్డిపాళ్ళ బ్రహ్మారెడ్డి S/o. వీరారెడ్డి, R/o. నెహ్రూనగర్
R10 : షేక్ సైదా హుస్సేన్, S/o. ఐదెసైదా, R/o. నెహ్రూనగర్
R11 : పెళ్ళి శ్రీనివాసరావు S/o. మల్లయ్య, R/o. వీరభద్రస్వామి గుడి దగ్గర
R12 : లింగారెడ్డి బ్రహ్మారెడ్డి S/o. కోటిరెడ్డి, R/o. నెహ్రూనగర్
R13 : నెలకంటి శ్రీను S/o. లక్ష్మారెడ్డి, R/o. 3వవార్డు
R14 : రావు మోహనరావు S/o. మన్నెయ్య, R/o. పోలీస్ క్వార్టర్స్ దగ్గర
R15 : కలల త్రిపురారెడ్డి S/o. వెంకటరెడ్డి R/o. నెహ్రూనగర్, 2వలైను
R16 : బచ్చు నరసింహారావు S/o. వెంకటేశ్వర్లు R/o. నెహ్రూనగర్
R17 : చల్లా గోవిందారెడ్డి S/o. పకీరారెడ్డి R/o. వీరభద్రరావు స్వామి గుడిదగ్గర
R20 : ఆర్జా శ్రీనివాసరావు S/o. కోటయ్య R/o. నెహ్రూనగర్
R23 : రాపోలు కొండలు S/o. చెన్నయ్య R/o. నెహ్రూనగర్
R24 : షేక్ ఫాతిమా W/o. సైదావలి R/o. చెన్నకేశవస్వామి కాలనీ
R26 : మద్దికుంట మంగయ్య S/o. వెంకటేశ్వర్లు R/o. నెహ్రూనగర్
R28 : తెల్లారి సునీత W/o. వెంకట్రావు R/o. 3వ వార్డు
R32 : పందిపట్ల గోకరి S/o. అప్పన్న R/o. నెహ్రూనగర్
R33 : బంగారు కృష్ణా S/o. వెంకటేశ్వర్లు R/o. చిన్ని చంద్రల పాలిష్‌మిల్ దగ్గర
R34 : పిల్లల మర్రి శౌరీలు W/o. భిక్షాలు R/o. నెహ్రూనగర్
R35 : నాగినేని చంద్రమ్మ W/o.రాములు, R/o. నెహ్రూనగర్
R36 : సంకల వీరయ్య, S/o. చిన్నకోటయ్య R/o.బస్టాండ్ వెనుక
R38 : మాచర్ల అంకమ్మ, W/o. పున్నయ్య R/o. నెహ్రూనగర్
R40 : తిరుమల శ్రీనివాసరావు, S/o. బాబు R/o. నెహ్రూనగర్
R41 : రావిపాటి వెంకటేశ్వరచారి, S/o. బ్రహ్మాచారి R/o. చంద్రవంక బ్రిడ్జి దగ్గర
R42 : మానుకొండ లక్ష్మయ్య, S/o. రాములు R/o. నెహ్రూనగర్
R45 : షేక్ అల్లాభి, W/o. హుస్సేన్ R/o. గంగవరం గ్రామం, గురజాలమండలం, పల్నాడు జిల్లా.
R46 : సుంకర కృష్ణ, S/o. శిర్రయ్య R/o. మందాది గ్రామం వెల్దుర్తి పల్నాడు జిల్లా.
R47 : కొండ మధుసుధనరావు, S/o. ఆదినారాయణ R/o. గంగవరం గ్రామం, గురజాలమండలం, పల్నాడు జిల్లా.
R48 : సుంకర వాసు, S/o. లక్ష్మయ్య R/o. నెహ్రూనగర్
R50 : తోట మిట్టమ్మ, W/o. వెంకటేశ్వర్లు R/o. నెహ్రూనగర్ 2వ లైను

అందరూ మాచర్ల గ్రామం మాచర్ల మండలం, పల్నాడు జిల్లా చెందిన వారు

పై కోర్టులో పిటీషనరు మీపై ఇన్ సాల్వెంట్ పిటీషన్‌ను దాఖలు చేసి ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీకు ముట్టియుండనందున నోటీసు నిమిత్తము **ది : 13-12-2022 తేదీన వాయిదా రోజు ఉదయం 10.30గం॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై ఆరోపణలు ఉన్న యెడల తెలుపుకొనగలరు.

వాయిదా తేది : 13-12-2022

దుగ్గరాజు అనంతరామయ్య
పిటీషనర్ తరపు న్యాయవాది గురజాల
సెల్ : 7671054310

వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మారుస్తున్న
రియల్ ఎస్టేట్ వెంచర్లను అరికట్టాలి

విశాలాంధ్ర-నరసరావుపేట : పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసి, వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చడాన్ని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. జిల్లా కమిటీ తీర్మానాన్ని పత్రికా విలేకరులకు ఆ సంఘం జిల్లా కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వర రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో వ్యవసాయం గిట్టుబాటు కాక రెండు లక్షల ఎకరాల భూమి పడావుగా మారిందని, మొత్తం సాగు భూమిలో ఇది 20 శాతం పైగా ఉందని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో మరో 10 శాతం పైగా సాగు భూమిని జిల్లాలో రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసి, వ్యవసాయేతర భూమిగా మార్చి పడావు పెడుతున్నారని ఆయన విమర్శించారు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చే క్రమంలో పాటించాల్సిన ఎలాంటి చట్టపరమైన నిబంధనలు పాటించకుండా, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కోట్ల రూపాయల అక్రమ వ్యాపారం చేస్తున్నారని ఆయన తెలిపారు. దీనివల్ల రోజురోజుకీ సాగుభూమి తగ్గిపోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ భూమిని వ్యవసాయతర రియల్ ఎస్టేట్ భూమిగా మార్చడం వల్ల వ్యవసాయ కార్మికులకి పనిదినాలు, ఉపాధి తగ్గిపోతున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల వినుకొండ మండలం తిమ్మాయిపాలెం వద్ద భ్రమరా జీన్సిటీ ప్రైవేట్ లిమిటెడ్ 100 ఎకరాల వ్యవసాయ భూమిని ఎలాంటి అనుమతులు లేకుండా రియల్ ఎస్టేట్ వెంచర్ వేశారని, ఈ వెంచర్లో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయని వాటిపై ఇప్పటికే అధికారులు విచారణ జరుపుతున్నారని ఆయన తెలిపారు. నర్సరావుపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించిన తర్వాత నరసరావుపేట చుట్టుపక్కల అన్ని మండలాల్లో పెద్దఎత్తున అనుమతులు లేకుండా రియల్ ఎస్టేట్ వెంచర్లు వేస్తున్నారని, దీనివల్ల వ్యవసాయ భూమి తగ్గిపోతున్నదని ఫలితంగా వ్యవసాయ కూలీలకు కౌలుదారులకు ఉపాధి తగ్గిపోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రియల్ ఎస్టేట్ వెంచర్లు వేయడం అనేది ఒక పెద్ద అక్రమ దందాగా మారిందని వ్యవసాయ భూమిని ప్లాట్లుగా మార్చి భూమి ధరను కృత్రిమంగా పెంచి, వ్యవసాయదారులకు సాగుభూమి అందుబాటులో లేకుండా చేస్తున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వం కూడా అనివార్యమైతే తప్ప, వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చడానికి అనుమతి ఇవ్వకూడదని ఆయన కోరారు. ప్రభుత్వం ఈ అక్రమ రియల్ ఎస్టేట్ వ్యాపారంపై తగిన చర్యలు తీసుకోకపోతే, భవిష్యత్తులో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-గురజాల : పట్టణంలోని స్థానిక వికాస్ స్కూల్లో బుధవారం ఒకటవ తరగతి రెండవ తరగతి విద్యార్థులకు టీఏఎస్ కార్యక్రమంలో భాగంగా వైద్య(రక్త) పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులలో ఫైలేరియా లక్షణాలు తెలుసుకునుటకు ఈ పరీక్షలు నిర్వహించడం జరిగిందని డాక్టర్ల బృందం తెలిపారు. ఒకవేళ లక్షణాలు ఉన్నట్లయితే ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా నివారణ చర్యలు చేపట్టేందుకు ఉపయోగపడుతుందని, వ్యాధి పరంగా కూడా అవగాహన ఉంటుందని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అజయ్, గౌస్, హనుమంతరావు, మలేరియా సూపరవైజర్ అంకమ్మరావు, డీఎంఓ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుకు దుప్పట్లు పంపిణి

విశాలాంధ్ర - భట్టిప్రోలు : మండలంలోని ఐలవరం గ్రామానికి చెందిన అత్తలూరి సత్యవతి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు 100 మంది వృద్దులకు దుప్పట్లు పంపిణి చేశారు. అత్తలూరి సత్యవతి వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం జరిగిన సంస్మరణ కార్యక్రమంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పాల్గొని ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అత్తలూరి బాలకృష్ణ, దీపాల శివప్రసాద్, జొన్నాదుల వెంకటేశ్వరరావు, కూరపాటి రఘురామయ్య, ఈడే శ్రీనివాసరావు, అత్తలూరి శకంర్, మాచర్ల నాగరాజు, జొన్నాదుల లీలాకృష్ణ, మాచర్ల నాగేశ్వరరావు, వాకా శేషు, వేజళ్ళ సతీష్, రాయన ప్రసాద్ తదిరతులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల ధనదాహానికి
యువత భవిష్యత్ నిర్వీర్యం: హరి

విశాలాంధ్ర-గుంటూరు : వైసీపీ ఎప్పుడేతై అధికారాన్ని చేపట్టిందో ఆ క్షణం నుంచి రాష్ట్రంలో రాబంధుల రాజ్యం నడుస్తుందని, చివరికి వైసీపీ నేతల ధనదాహానికి యువత భవిష్యత్తు సైతం నిర్వీర్యమైపోతుందని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశం మొత్తంలో అత్యధికంగా మాధకద్రవ్యాలు ఆంధ్రప్రదేశ్‌లోనే పట్టుపడ్డాయని స్మగ్లింగ్ ఆఫ్ ఇండియా నివేదిక ఇవ్వటం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్క ఏడాదిలోనే 18,627 కిలోల మత్తుపదార్ధాలను అధికారికంగానే పట్టుకుంటే అనధికారికంగా ఇంకెన్ని వేల కిలోలు తరలిస్తున్నారో తలుచుకుంటేనే భయం వేస్తుందన్నారు. గంజాయి, హెరాయిన్ లాంటి మత్తు పదార్థాలకు అడ్డాగా రాష్ట్రాన్ని మార్చారన్నారు. చిన్న చిన్న బడ్డీ కొట్లలోనూ, మాల్స్‌లోనూ ఒక్కపొడి పాకెట్ దొరికినంత సులువుగా గంజాయి పొట్లాలు దొరుకుతున్నాయన్నారు. కొన్ని కాలేజీలు మాదకద్రవ్యాలకు నిలయంగా మారినా కాలేజీ యాజమాన్యాలు కానీ పోలీసులు కానీ పట్టించుకోవటం లేదని విమర్శించారు. కాదేదీ కవితకనర్హం అన్నట్లు వైసీపీ నేతల దోపిడికి పంచభూతాలు చాలటం లేదని విమర్శించారు. సహజవనరులైన ఇసుక, మట్టి, ఎర్ర చందనంతో పాటూ అక్రమ మద్యం, భూములను వైసీపీ నేతలు దోచుకుంటున్నారని అన్నారు. ప్రజలు అధికారం ఇచ్చింది దోచుకువటానికే అన్నట్లు వైసీపీ నేతలు పాలిస్తున్నారని విమర్శించారు.

బీసీలతో పెట్టుకుంటే పార్టీ కూడా నిలబడలేదు: తాళ్ళ

విశాలాంధ్ర-దుగ్గిరాల : పుంగనూరుని పెద్దిరెడ్డి అనుచరులు బీహార్ లాగా మార్చుతున్నారని రామచంద్ర యాదవ్ ఇంటిని విధ్వంసం చేయడం చాలా దారుణమని మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్ల అశోక్ యాదవ్ అన్నారు. మండల కేంద్రమైన దుగ్గిరాల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం తాళ్ల అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అశోక్ యాదవ్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా పుంగనూరుని పెద్దరెడ్డి అనుచరులు బీహార్ లాగా మారుస్తున్నారని రామచంద్ర యాదవ్ ఇంటిపై విధ్వంసం చేయడం దారుణమని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గతంలో ఎన్నడూ ఇటువంటి చర్యలు లేవన్నారు. రాష్ట్రంలో యాదవ కులంతో పెట్టుకున్న ఏ పార్టీ కూడా బాగుపడింది లేదన్నారు. పార్టీలకతీతంగా యాదవుల కులమంతా రామచంద్ర యాదవ్‌కు అండగా నిలబడతామన్నారు. ఈ కార్యక్రమంలో కేశంనేని వాసు బాబు, యాదవ నాయకులు పసుపులేటి రవి యాదవ్, తాడిపోయిన శివశంకర్ యాదవ్, కాక బాబు యాదవ్, కోటి యాదవ్, పసుపులేటి వరదరాజుల యాదవ్, పసుపులేటి గోపి రాజు యాదవ్, రాజశేఖర్ యాదవ్, తాడిబోయిన ఏడుకొండలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యావత్ ప్రపంచాన్నే ఆకర్షించిన ఇరాన్ మహిళల పోరాటం

ప్రముఖ రచయిత్రి ఎవికె సుజాత

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : హిజాబ్‌దారణకు వ్యతిరేకంగా మూడు నెలలుగా ఇరాన్ మహిళలు చేస్తున్న పోరాటం అద్వితీయమైనదని, ఆ దేశాన్ని కుదిపేయటంతో పాటు అది యావత్ ప్రపంచాన్ని ఆకర్షించిందని రచయిత్రి ఎవికె సుజాత అన్నారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 'ఇరాన్ మహిలల నైతిక విజయం'పై హర్షం ప్రకటిస్తూ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ కరుడుగట్టిన ఛాందసవాద నిబంధనలకు విరుద్ధంగా ఇరానీ మహిళల నేతృత్వంలో సాగుతున్న ఉద్యమంలో కీలక విజయం సాధించటం గొప్ప విషయమన్నారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ ఇరాన్ మహిళల ఉద్యమంపై మాధ్యమాల్లో లోతైన చర్చలు, విశ్లేషణలు జరిగాయని, ఇరాన్ మహిళల నైతిక విజయం అనేక దేశాల మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. అయితే అటార్నీ జనరల్ ప్రకటించినప్పటికీ తమకు ఆమోదయోగ్యమైన విధానం వెలువడే వరకూ ఉద్యమాన్ని నిలిపేయకూడదని ఇరాన్ మహిళలు నిర్ణయించుకోవటం మెచ్చుకోదగినదన్నారు. ఈ సమావేశంలో మాధవి, రాజ్యలక్ష్మి, కమలకుమారి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపు లేఖ
న్యాయవాద వృత్తిపై దాడే

విశాలాంధ్ర-వినుకొండ : వినుకొండ పట్టణంలోని క్రిస్టియన్ మైనారిటీ ఆస్తులను పరిరక్షించే ఉద్దేశంతో ఏర్పడిన కమిటీకి వినుకొండ బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు పీజే లూకా, ముట్లూరి ఎలీషా బాబు, నీలం శేఖర్ బాబు, నేలపట్ల అశోక్ బాబు, కాకాని నాగేశ్వరరావు, దూపాటి విజయ్ కుమార్, దుగ్గిపోగు విజయ్, రెడ్డిపోయిన బాబు న్యాయ సహాయాన్ని అందిస్తూ ఉన్నారు. క్రిస్టియన్ మిషనరీ ఆస్తుల పరిరక్షణలో భాగంగా వచ్చిన వారి తరఫున న్యాయవాది ఎంఎస్ ప్రసాద్ వాదించియున్నారు అయితే క్రిస్టియన్ మైనారిటీ ఆస్తుల పరిరక్షణ కమిటీకి బెదిరింపు లేఖలు రాస్తూ అందులో వారికి న్యాయ సహాయం అందిస్తున్న న్యాయవాదులను అంతమొందిస్తామని బెదిరింపు లేఖను క్రిస్టియన్ ఆస్తులను కొనుగోలు చేసిన వారి తరఫున పంపారు. ఆ బెదిరింపు లేఖలో వారి న్యాయవాది అయిన ఎంఎస్‌ను చంపుతామని ప్రకటించియున్నారు. వృత్తిలో భాగంగా న్యాయవాదులు తమ వద్దకు వచ్చిన క్లైంట్లు తరఫున వాదిస్తూ న్యాయసహాయాన్ని అందిస్తారు. అట్లా న్యాయసహాయాన్ని అందిస్తే చంపుతామని బెదిరించటం వ్యక్తిగతంగా దాడులకు పాల్పడతామని ప్రకటించటం అనేది న్యాయవాద వృత్తి మీద జరిగే దాడిగానే భావించాలి. ఈ విషయమై అసోసియేషన్ కార్యవర్గం, సభ్యులు తీవ్రంగా ఖండించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది చాగంటి వీరాంజనేయ చౌదరి, గరికపాటి సురేష్ కుమార్, నీలం శేఖర్ బాబు, గంధం హరిప్రసాద్, కొత్త హనుమంతురావు, అశోక్ బాబు, బెక్కంటి నాగరాజు, విజయ్, దుళ్ళ నాగరాజు తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

గిడుగు రుద్రరాజు ప్రమాణ స్వీకారానికి తరలి రావాలి

విశాలాంధ్ర-ఫిరంగిపురం: ఈ నెల 9వ తేదిన విజయవాడలో గిడుగు రుద్రరాజు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేయుచున్న శుభ సందర్భంగా రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని కాంగ్రెస్ పార్టి రాష్ట్ర అధికారప్రతినిధి గడ్డం పాల్ విజయకుమార్ ఇక ప్రకటనలో బుధవారం తెలిపారు. బుధవారం గుంటూరుజిల్లా ఫిరంగిపురం మండలం విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ రుద్ర రాజు తోపాటు రాష్ట్ర కాంగ్రెస& పార్టి వర్కింగ్‌ప్రెసిడెంట్ గా షేక్. మస్తాన్‌వలి, జంగా గౌతం, సుంకర పద్మశ్రీ, పోచారెడ్డి రాకేష్‌రెడ్డిలు ప్రమాణ స్వీకారం చేయ నున్నట్లు పాల్ తెలిపారు.

బీసీలను మోసం చేసిన జగన్ సర్కార్

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : అచ్చంపేట మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యకమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నందిగామ ఆశీర్వాదం మాట్లాడుతూ ప్రజలు వారి సమస్యలను నాయకుల ముందు వెళ్ళబోసుకున్నారు. జగన్‌మోహన్ రెడ్డి బీసీ కులాల కోసమని కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి వాటికి కొంతమందిని డైరెక్టర్లుగా నియమించి వారికి ఒక్క రూపాయి జీతం ఇవ్వకుండా మీ సామాజిక వర్గానికి చెందిన వారికి ప్రభుత్వ సలహాదారులుగా నియమించుకుని మాకు కేటాయించిన బడ్జెట్ నిధులు మొత్తం వారికిస్తూ బీసీలను మోసం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో బత్తుల శ్రీనివాసరావు, జువ్వ రామారావు, పోట్ల శ్రీనివాసరావు, వాసిరెడ్డి రవిచంద్, కూకట్‌పల్లి అయ్యప్పరాజు, కూకట్‌పల్లి వీరాంజనేయులు, మేకల వెంకట్రావు, ఆవుల గురునాథం, తాళ్లూరు లక్ష్మీనారాయణ, గోళ్ళమూడి పూర్ణచంద్రరావు, వాసిరెడ్డి వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

పొడపాడులో 'ఇదేమి ఖర్మ రాష్ట్రానికి'...

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండలంలోని పొడపాడు గ్రామంలో బుధవారం ఇదేమి ఖర్మ రాష్ట్రానికి అనే కార్యక్రమమును మండల టీడీపీ అధ్యక్షులు అర్తిమళ్ళ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలన్నిటిని, ప్రజలు పడుతున్న నాన్న అవస్థలను, ప్రజల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ రామ్‌గోపాల్ రావు, షేక్ ముంతాజ్, గ్రామ సర్పంచ్ కాసరబాద హనుమంతరావు, షేక్ మస్తాన్ షరీఫ్, పొడపాడు మాజీ సర్పంచ్ షేక్ మస్తాన్ వలి, పాటిబండ్ల శివమ్మ, షేక్ మౌలాలి, కాసరబాద శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అసంఘటిత రంగ కార్మికులకు
సమగ్ర చట్టం చేయాలి

విశాలాంధ్ర-గూడూరు : అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని కృష్ణ జిల్లా ఏఐటీయూసీ కన్వీనర్ టీ తాతయ్య డిమాండ్ చేశారు. పెడన మున్సిపాలిటీలో పనిచేస్తున్న ముఠా కార్మికుల సమావేశం సర్వోదయ వివర్స్ సొసైటీ కార్యాలయంలో యూనియన్ అధ్యక్షులు కామ్రేడ్ కట్ట హేమసుందర్ రావు అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న టీ తాతయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఐదు కోట్ల పైగా అసంఘటిత రంగంలో ముఠా కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్మికులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి ఏ విధమైన సంక్షేమ పథకాలు అందటలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ముఠా కార్మికులకు అవసరమైన సంక్షేమ పథకాలలో భాగంగా ప్రతి కార్మికునికి 60 సంవత్సరాల నుండి తర్వాత నెలకి రూ 5000 పెన్షన్ ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుడు ఏదైనా ప్రమాదవశాత్తు చనిపోతే ప్రభుత్వమే 10 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ముఠా కార్మికుల ఈఎస్ఐ, ఈపీఎఫ్ ప్రభుత్వమే కట్టాలన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించే పోరాటాలకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ముఠా కార్మిక సంఘం అధ్యక్షులు కట్ట హేమ సుందరావు సెక్రటరీ ఏలేష్ వెంకటేశ్వరరావు వైస్ ప్రెసిడెంట్ఎండి ఇసాక్.జాయింట్ సెక్రెటరీ పీవీకే సుబ్రహ్మణ్యం కోశాధికారి అబ్దుల్ ఐ, కమిటీ సభ్యులు జోగి పైడియా, నూలు ఈశ్వరరావు, బత్తినపోతురాజు మురాల నాగేశ్వరరావులు పాల్గొన్ని ప్రసంగించారు.

నిరుద్యోగులకు ఉపాధి
అవకాశాలు కల్పించాలి

విశాలాంధ్ర-గుడివాడ : 20 ఏళ్లుగా ఎంతో మందిని ఉపాధ్యాయులుగా తీర్చి దిద్దిన ఎంఈడిలు నేడు ఉపాధి అవకాశలు లేక రొడ్డున్న పడినట్లు ప్రభుత్వం వెంటనే ఉపాధి అవకశాలు కల్పించాలని రాష్ట్ర ఎంఇడి అభ్యర్థుల సంక్షేమ సంఘం కన్వీనర్ బి.రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎన్‌జివో హెూంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సంక్షేమ సంఘం మహిళా కన్వీనర్లు పి.నిర్మలకుమారి, జి.సుచరితలతో కలసి రమేష్ మాట్లాడుతూ అర్హత కలిగి ఎంఇడి పూరి చేసిన 10వేల మంది నిరుద్యోగులగా నేడు ఉన్నమన్నారు. గత 20 సం.లుగా ప్రైవేట్ డిఎడ్, బిఎడ్ కాలేజీలలో అనేక వేలమందిని ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దిన మా కుటుంబాలు నేడు ఉపాధి లేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. 2, 3 పీజీలు పూర్తీ చేసి పలు ఉపాధ్యాయ కళాశాలలో ఏళ్ల తరబడి పని చేసిన మాకు నేడు డిఇడి, బిఇడిలను కళాశాల తీసి వేయడం వల్ల మా పరిస్థితి నేడు అర్థిక ఇబ్బందులు పడుతునమన్నారు. 1988 నుండి గత ఏ ప్రభుత్వమూ ఎంఎడ్ అర్హతతో ఎం.ఈ.ఓ., డిప్యూటీ డి.ఈ.ఓ , ప్రభుత్వ డైట్, బిఎడ్ కాలేజీలలో నియామకాలు చేపట్టలేదన్నారు. ఉపాధి ఇచ్చే నోటిఫికెషన్స్ అందుబాటులోకి రాక మా వయస్సు దాటిపోయిందన్నారు. రానున్న నోటిఫికెషన్స్‌లో మాకు ప్రత్యేక గ్రేస్ మార్కులు ఇవ్వాలని, అవుట్ సోర్సింగ్ పోస్టులకు అయినా అర్హత కల్పించి ఉపాధి కల్పించాలన్నారు. ఎం.ఈ.ఓ 1,2 నియామకాలు, ప్రభుత్వ డైట్, బిఎడ్ కాలేజీలలో నియామకాల చేప్పాటలన్నారు. డిప్యూటీ డి.ఈ.ఓ నియామకాలు, సచివాలయంలో ఎడ్యుకేషనల్ సెక్రటరీ, నాడు నేడు పథకాలలో నియామకాలలో తమకు ప్రధ్యత కల్పించాలన్నారు. వయస్సు పరిమితిని పెంచడం, ప్రైవేట్ ఉపాధ్యాయ కళాశాలలను పెచ్చాలని, ప్రతి సంవత్సరం రాటిఫికేషన్ జరిగేలా చూడలని, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ నియామకాలలో ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలిని డిమాండ్ చేశారు.

తేజస్వికి నివాళి

విశాలాంధ్ర-పమిడిముక్కల: గుంటూరు జిల్లా తక్కెళ్ళపాడులో ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన వైద్య విద్యార్థిని పిన్నమనేని తపశ్వికి తెలుగు దేశం నాయకులు ఎన్.ఐ.ఆర్ లు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పామర్రు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి వర్ల కుమార రాజా మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం లో మహిళల కు రక్షణ లేదని విమర్శించారు.భగవంతుడు ఆమె ఆత్మ శాంతి కలిగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎన్.అర్.ఐ. మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఎ.కృష్ణప్రియ యం.ఇందిర జక్కా శ్రీనివాసరావు డి.శంకర్రావు ఉమామహేశ్వరరావు ఎ.సురేష్ బోలెం లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముళ్లకంచె తొలగింపు



విశాలాంధ్ర-వేమూరు : ప్రభుత్వం పేదలకు అందించిన జగనన్న నివాస స్థలాలకు వెళ్ళే రోడ్డుకు ఇరువైపులా ముళ్ళ కంచ పెరిగి ఉండటంతో రోడ్డుకు ఇరువైపులా కంచి తొలగించేందుకు పంచాయితీ అధికారులు చర్యలు తీసుకున్నారు. గత సోమవారం జగనన్న లేఔట్లను పరిశీలించిన హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ సూచనల మేరకు పంచాయితీ అధికారులు ముళ్ళకంచి తొలగించేందుకు సత్వరం చర్యలు తీసుకున్నారు. గ్రామ సర్పంచ్ శ్రీలక్ష్మీ తిరుపతమ్మ శ్రీనివాస్, పంచాయితీ కార్యదర్శి చేబ్రోలు నాగేశ్వరరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సరళ, పంచాయితీ సిబ్బంది కంచి తొలగించే పనుల్లో నిమగ్నమయ్యారు.

బీసీ మహాసభకు...

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : విజయవాడలో బుధవారం జరిగిన 'జయహో బీసీ మహాసభ' కు గుంటూరు తూర్పు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున బీసీ నాయకులు తరలివెళ్ళారు. తొలుత ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా బహిరంగ సభకు సిద్ధమైన బస్సుకు జెండా ఊపి ప్రారంబించారు. తూర్పు నియోజకవర్గం నుంచి బీసీ నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మహాసభకు వెళ్ళారు. ఈ కార్యక్రమంలో రాచమంటి భాస్కర్, సంకూరి శ్రీనివాసరావు, షేక్.మీరావలి, యాట్ల రవికుమార్, వేముల శ్రీనివాసరావు, ఖాజా మొహిద్దీన్ చిష్టి, కీసరి సుబ్బారెడ్డి, సుబ్బులు, శాంతిలక్ష్మి తదితరులు ఉన్నారు.

మెరుగైన ఆరోగ్యశ్రీ సేవలు అందించాలి

విశాలాంధ్ర-నరసరావుపేట కలెక్టరేట్ : ఆరోగ్యశ్రీ ద్వారా ప్రతి లబ్ధిదారునికి ఉచిత వైద్యం అందించాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సూచించారు. మంగళవారం పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని స్పందన మీటింగ్ హాల్‌లో ఆరోగ్య మిత్ర డే జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించటం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో గతంలో ఉన్న 2446 జబ్బుల నుంచి 3255కి పెంచారని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వం నూతనంగా ఇచ్చిన ప్రకారం ప్రాంతాలతో సంబంధం లేకుండా ఎవ్వరైనా ప్రమాదానికి గురైతే ఆ క్షతగాత్రులకు ఉచితంగా సీఎంసీవో ద్వారా ఉచిత వైద్యం అందించాలని ఆ తరువాత ఆ కేసులను ఆరోగ్యశ్రీలో వైద్యం చేయించాలని అన్నారు. అదేవిధంగా ఏదైనా ఆరోగ్యశ్రీ హాస్పిటల్‌లో ఒక జబ్బుకు ఆ హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ లేకపోతే ఆ జబ్బు కవర్ అయ్యే హాస్పిటల్‌కి రిఫర్ చేసి మెరుగైన వైద్యం అందించాలని అన్నారు. ప్రతి ఆరోగ్యమిత్ర డ్రెస్ కోడ్‌ను కలిగి ఉండాలని పేర్కొన్నారు. అదేవిధంగా విధులలో అలసత్వం వహించరాదని, సమయపాలన ప్రతిఒక్కరూ పాటించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి సంతకంతో కూడిన సందేశ పత్రాన్ని డిశ్చార్జ్ సమయంలో పేషంట్‌కి చదివి వినిపించాలని తెలియచేశారు. స్పందన ద్వారా వచ్చిన కంప్లైంట్‌లను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రతీ ఆరోగ్య మిత్రా వారి వారి హాస్పిటల్‌లో హెల్ప్ డెస్క్ దగ్గర ఉండి వచ్చిన పేషంట్‌లకు సత్వర వైద్య సేవలు అందేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ పి.సునీలా, టీమ్ లీడర్స్, ఆరోగ్య మిత్రాలు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

విశాలాంధ్ర-వినుకొండ : బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి రామకృష్ణ భారతీ రాణి దంపతులు స్థానిక వెల్లటూరు రోడ్డులోని గుమ్మడి వృద్ధాశ్రమంలో వృద్ధుల నడుమ పెళ్లిరోజు వేడుక జరుపుకున్నారు. వృద్ధులకు పండ్లు, కేక్ పంపిణీ చేసి ఆశ్రమానికి రైస్ బ్యాగ్‌ను అంద జేశారు. అనంతరం ఆశ్రమంలోని ఆవులకు అర ట్రక్కు పశుగ్రాసం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కుటుంబంలోని ముఖ్యమైన పుట్టినరోజు పెళ్లిరోజు వేడుకలను ఇటువంటి వృద్ధుల మధ్య జరుపుకుంటే మానసిక ఆనందం, ప్రశాంతత కలుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు గుమ్మడి వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతానికి చర్యలు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జిల్లాలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్ళ నిర్మాణాలు వేగవతం చేసేందుకు స్పెషల్ ఆఫీసర్లు, హౌసింగ్ శాఖాధికారులు లే అవుట్లలో ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించి నిర్మాణాలు వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వీసీ సమావేశ మందిరం నుంచి హౌసింగ్, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణం, పాఠశాలలో నాడు నేడు పనులు, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై సంబంధిత శాఖాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఇళ్ళ నిర్మాణాలకు సంబంధించి లబ్దిదారులతో మాట్లాడి, లబ్దిదారులు ఇళ్ళ నిర్మాణాలు చేపట్టే విధంగా చూడాలన్నారు. స్పెషల్ ఆఫీసర్స్ స్వయం సహాయక సంఘాల గ్రూపు సభ్యులకు ఇళ్ళ నిర్మాణాలకు అవసరమైన రుణాలు అందించేలా డీఆర్డీఏ, మెప్మా శాఖల అధికారులను సమన్వయం చేసుకోవాలన్నారు. నాడు నేడు రెండవ దశ క్రింద చేపడుతున్న పాఠశాలల అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. సంయుక్త కలెక్టర్ రాజ కుమారి మాట్లాడుతూ ఖరీఫ్ 2022-23కి గాను ధాన్యానికి కనీస మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించిందని, మద్దతు ధరకన్నా తక్కువగా ఎవరు ధాన్యాన్ని విక్రయించకుండా సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. జిల్లాలో ధాన్యం విక్రయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఏర్పడిన నేరుగా కంట్రోల్ రూమ్ నెంబర్ 9491392717 కు ఫిర్యాదు చేసి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి మోహన్ రావు, పీడీ హౌసింగ్ సాయినాథ కుమార్, పీడీ డీఆర్డీఏ హరిహరనాథ్, పీడీ మెప్మా వెంకటనారాయణ, తదితర అధికారులు పాల్గొన్నారు.

రీ సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-రొంపిచర్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూసర్వే కార్యక్రమమును పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అన్నారు. మండలంలో రొంపిచర్ల, అన్నవరం రెవెన్యూ గ్రామాల్లో బుధవారం జరిగిన రీ సర్వేను జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే జరిగేటప్పుడు భూములపై వాస్తవంగా ఉన్న రైతులను గుర్తించి వారి పేర్లను నమోదు చేసుకోవాలని అన్నారు. మరణించిన పెద్దల పేరిట ఉన్న పొలాలను డెత్ సర్టిఫికేట్, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికేట్లను పరిశీలించిన తరువాత వారి వారసుల పేరిట పొలాలు పంపిణీ చేయాలని ఆదేశించారు. రీ సర్వే పూర్తిఅయిన తర్వాత రైతులు అంగీకారంతో భూహక్కు పత్రాలను పంపిణీచేయటం జరుగుతుందని అన్నారు. గ్రామాలలో జరుగుతున్న రీ సర్వే కార్యక్రమమును రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి, తహశీల్దార్ జె.శ్రీనివాసరావు, మండల సర్వేయర్ జి.భాగ్యలక్ష్మీ, ఆర్.ఐ సుబ్బారావు, విఆర్‌ఓలు పడాల సుబ్బారెడ్డి, కృష్ణ, సర్వే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శశిధర్ స్వీట్స్ ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-వినుకొండ : నరసరావుపేట రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన శశిధర్ స్వీట్స్ అండ్ బేకరీ నూతన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు తనయుడు, యువనాయకులు బొల్లా గిరిబాబు, నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు. శివయ్య స్థూపం సెంటర్‌లో శశిధరణి ఘీ స్వీట్స్ నూతన వ్యాపార ప్రారంభోత్సవం లో వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.